ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
గురువారం 9 జనవరి 2025



ప్రత్యేక తరగతులను పర్యవేక్షించిన డీఈవో

సీతానగరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సీతానగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను డీఈవో తిరుపతి నాయుడు బుధవారం పర్యవేక్షించారు. పబ్లిక్ పరీక్షలకు ఏ విధంగా సిద్ధపడుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నోట్‌బుక్‌లను బాగా రాసుకోవాలని సూచించారు. అనంతరం 6 నుంచి 10 తరగతుల నోట్ బుక్‌లను పరిశీలించారు. వివిధ సబ్జెక్టులపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులంతా మొక్కలు పెంచాలన్నారు. ఆ తర్వాత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎంఈవోలు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరికరాలు ఉన్నా.. పనిచేయట్లే!



గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి ఆసుపత్రిలో మూలన పడి ఉన్న మంచాలు

- సౌకర్యాల్లేక మూలకు చేరిన వైనం
- కొన్నిచోట్ల మరమ్మతులు కరువు
- ఇబ్బందుల్లో రోగులు
- ఇదీ జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో పరిస్థితి

ఆంధ్రజ్యోతి విజిట్

జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో విలువైన వైద్య పరికరాలు వినియోగానికి నోచుకోవడం లేదు. వాటి ద్వారా రోగులకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. దీంతో అత్యవసర వేళల్లో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో సిబ్బంది కొరత కారణంగా ఐసీయూ పూర్తి స్థాయిలో ఉపయోగ పడడం లేదు. పాలకొండలోని ఏరియా ఆసుపత్రిలో యంత్ర పరికరాల వినియోగం మాత్రం అంతంతమాత్రమే. గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి సీహెచ్‌సీలో వసతి సమస్య కారణంగా విలువైన పరికరాలు, మంచాలు మూలన పడి ఉన్నాయి. కురుపాం సీహెచ్‌సీలోనూ గదులు లేకపోవడంతో వైద్య పరికరాలను స్టోర్ రూముకు పరిమితం చేశారు. ఇక్కడ ఒక వార్డే ఉండడంతో వరండాలో రోగులకు సేవలందిస్తున్నారు. మొత్తంగా జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో నెలకొన్న పరిస్థితులతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు.

- (పూర్తి వివరాలు ఆరో పేజీలో)



కురుపాం: సీహెచ్‌సీ స్టోర్ రూమ్‌లో ఉన్న ఐసీయూ,ఆక్సిజన్ పరికరాలు

రైల్వే జోన్ కల నెరవేరిన వేళ

- విశాఖ కేంద్రంగా ప్రధాని మోదీ శంకుస్థాపన
- త్వరలోనే వైజాగ్ కేంద్రంగా ఆర్‌ఆర్‌బీ పరీక్షలు
- నిరుద్యోగులకు తప్పనున్న కష్టాలు
- కొత్త రైళ్లు వచ్చే అవకాశం
- జిల్లావాసుల హర్షం

పార్వతీపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లావాసుల కల నెరవేరింది. ఎన్నాళ్ల నుంచో వేచి చూస్తున్న రైల్వే జోన్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి బుధవారం ప్రధాని మోదీ శంకుస్థాపన చేయడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లావాసుల్లో సరికొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ముఖ్యంగా నిరుద్యోగులకు ఇదొక వరం లాంటిదనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. త్వరలోనే విశాఖ కేంద్రంగా రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు కానుందని, ఈ ప్రాంతంలోనే ఆర్‌ఆర్‌బీ పరీక్షలు జరగనున్నాయని, కొత్త రైళ్లు వచ్చే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటివరకు రైల్వేశాఖ నిర్వహించే ఆర్‌ఆర్‌బీ ఉద్యోగ నియామక పరీక్షలకు తెలంగాణాలోని సికింద్రాబాద్ లేదా ఒడిశాలోని భువనేశ్వర్‌కు వెళ్లి పరీక్షలు రాయాల్సి వచ్చేది. దీనివల్ల జిల్లావాసులు ఎన్నో ఇబ్బందులకు గురయ్యేవారు. ఈ పరిస్థితుల్లో విశాఖలో రైల్వేజోన్ ఏర్పాటు చేయడం ఎంతో శుభపరిణామమని నిరుద్యోగులు చెబుతున్నారు.

నాలుగో లైన్ వచ్చే అవకాశం...

జిల్లాకు సంబంధించి ఇప్పటివరకు విశాఖ నుంచి రెండు రైల్వేలైన్లు ఉన్నాయి. మూడు రైల్వేలైన్ నిర్మాణంలో ఉంది. అయితే విశాఖలోని రైల్వేజోన్ ఏర్పాటుతో నాలుగో రైల్వేలైన్ కూడా వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల ప్రస్తుతం ఉన్న పాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు అదనంగా మరికొన్ని రానున్నాయి. విశాఖ-పార్వతీపురం మధ్య ఇకపై రెగ్యులర్‌గా రైళ్లు నడిచే అవకాశం ఉంది.

సమస్యలను నేరుగా చెప్పొచ్చు..

రైల్వేశాఖ ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఇకపై నేరుగా విశాఖలోనే రైల్వే ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇవ్వొచ్చు. గతంలో అయితే భువనేశ్వర్ వెళ్లాల్సి వచ్చేది. మరికొన్ని సమస్యలను విశాఖలో డివిజనల్ రైల్వే మేనేజర్‌కు వినతిపత్రాలు అందించేవారు. తాజాగా రైల్వేజోన్ ఏర్పాటుతో ఆ కష్టాలు తప్పనున్నాయి.



రిమోట్‌తో శంకుస్థాపన చేస్తున్న ప్రధాన మంత్రి మోదీ



ప్రధాని మోదీని కలుసుకున్న పార్వతీపురం, కురుపాం ఎమ్మెల్యేలు విజయచంద్ర, జగదీశ్వరి

ఎంతో ప్రయత్నించా.. పార్లమెంట్‌లో పదేళ్లు పోరాడా ..

విశాఖ రైల్వే జోన్ కోసం ఎంపీగా గత పదేళ్లు పార్లమెంట్‌లో ప్రస్తావిస్తూ.. పోరాడాను. ఎన్నోదఫాలు కేంద్రప్రజాప్రతినిధులకు వినతి ఇవ్వడమేకాకుండా ... రైల్వేజోన్ ఆవశ్యకత.. ఉత్తరాంధ్రకు ఏళ్లతరబడి జరుగుతున్న నష్టాన్ని వివరించాను. ఇప్పటికి ప్రధాన కార్యాలయం విశాఖపట్టణం వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వయంగా వచ్చి శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో పాటుగా నేను కేంద్రమంత్రిగా పాల్గొనడం.. ఉత్తరాంధ్రకు మేలు కలిగే 'విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం' నిర్మాణం కోసం పాలుపంచుకోవడం సంతోషంగా ఉంది. ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం జిల్లాకు మరింత లబ్ధికలిగించేలా మున్ముందు చర్యలుంటాయి. భారీ ప్రాజెక్టులు పూర్తిచేయడమే కాకుండా.. కొత్తవి కూడా మంజూరవుతాయి. ప్రధానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నా.

- కె.రామ్మోహన్‌నాయుడు, కేంద్ర మంత్రి

ముగిసిన రెవెన్యూ సదస్సులు

- సమస్యలపై వెల్లువెత్తిన వినతులు
- ఇక పరిష్కారమే మిగులు

పార్వతీపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో నెల రోజులుగా నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలు బుధవారంతో ముగిశాయి. గత నెల 6న రెవెన్యూ సదస్సులను ప్రారంభించగా జిల్లావ్యాప్తంగా 6,136 వినతిపత్రాలను అధికారులు స్వీకరించారు. వాటిల్లో 574 అర్జీలకు పరిష్కార మార్గం చూపారు. మిగిలిన 5,562 వినతిపత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కరించనున్నారు. వాటిల్లో అత్యధికంగా ఆర్‌వోఆర్‌కు 4,256 , రీసర్వేకు 454, ప్రభుత్వ భూములపై 264, జీఎస్‌డబ్ల్యూఎస్‌కు 235, గ్రీవెన్స్ రీసర్వే 186, సరిహద్దు సమస్యలపై 17, పట్టా సబ్ డివిజన్‌పై 149, జిరాయితీ భూములపై 131, ఏజెన్సీ ప్రాంతాల్లో భూ సమస్యలపై 81 వినతులు వచ్చాయి. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జేసీ శోభిక ఆదేశాల మేరకు రెవెన్యూ సదస్సుల్లో వివిధ సమస్యలపై వచ్చిన వినతులను పరిశీలించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డీఆర్వో హేమలత తెలిపారు.

వైకుంఠ ఏకాదశికి 'తోటపల్లి' ముస్తాబు



కోదండరామస్వామి ఆలయం

గరుగుబిల్లి, జనవరి 8 (ఆంధ్ర జ్యోతి): వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో తోటపల్లి వేంకటేశ్వర, కోదండ రామస్వామి దేవస్థానాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తు న్నారు. ఈ నెల 10న భారీగా భక్తులు తరలిరానున్న దృష్ట్యా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఈవో సూర్యనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ.. వైకుంఠ ఏకాదశి పర్వ దినాన్ని పురస్కరించుకుని స్వామివారికి విశేష పూజలు చేస్తామన్నారు. ఆ తర్వాత ప్రత్యేక పల్లకిలో తిరువీధి మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పరిసర ప్రాంత భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామని వెల్లడించారు.

ఆరుబయటే తరగతులు

- డిగ్రీ కళాశాల విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- వేధిస్తున్న వసతి సమస్య
- మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే జయకృష్ణ
- స్థానికుల్లో చిగురిస్తున్న ఆశలు

6లో

ఘనంగా పెదపోలమాంబ అంపకోత్సవం

- ఘటాలతో తిరువీధి
- అమ్మవారికి ప్రత్యేక పూజలు
- తరలివచ్చిన భక్తులు

6లో

భక్తి శ్రద్ధలతో పొన్నాకుల హారతి

- ఆలయాల్లో ధనుర్మాసోత్సవాలు
- వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

8లో

మన్యం అభివృద్ధికి కృషి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎంపీ తదితరులు

పార్వతీపురం, జనవరి 8 (ఆంధ్ర జ్యోతి): జిల్లా అభివృద్ధికి మరింతగా కృషి చేయాలని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతవాసులకు విద్య, వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులు, చిన్నారుల్లో ఎనీమియా లోపాన్ని అధిగమించాలన్నారు. గ్రామాలకు ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లను పంపించి రక్తహీనతతో బాధపడుతున్న వారిని దత్తత తీసుకోవాలని సూచించారు. మెరుగైన చర్యలు చేపట్టడం వల్ల రక్తహీనత బాధితుల సంఖ్య తగ్గుముఖం పడుతుందని తెలిపారు. సౌర విద్యుత్, వ్యవసాయం ప్రయోజనాలపై అవగాహన కల్పించా లన్నారు. పీఎం సూర్యఘర్ పథకం వల్ల ప్రజలకు విద్యుత్ భారం తగ్గుతుందని వెల్లడించారు. జిల్లాలో పీఎం అర్బన్ ఆవాస్ యోజన ఇళ్ల నిర్మాణాలను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మూడు రాష్ట్ర హైవేలను జాతీయ రహదారులుగా మార్పు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదించినట్టు తెలిపారు. పవర్ ప్రజెంటేషన్ ద్వారా శాఖల వారీగా అభివృద్ధి పనుల ప్రగతిని వివరించారు. అనంతరం అరకు ఎంపీ తనూజారాణి మాట్లాడుతూ.. లక్ష్యాలను సాధించేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఎంపీ ల్యాండ్ నిధులతో రోడ్లు డ్రైనేజీ కమ్యూనిటీ భవనాల నిర్మాణాల పనుల వివరాలపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, భవన నిర్మాణాలు, పాఠశాలలో మరుగుదొడ్లు మరమ్మతులు, ఆధునికీకరణ పనులకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ శోభిత, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో హేమలత, డీఎంహెచ్‌వో భాస్కరరావు ,డ్వామా పీడీ రామచంద్రరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్, జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాలికల వికాసానికి పటిష్ఠ చర్యలు

బాలికల వికాసానికి పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. 11 నుంచి 18 సంవత్సరాల లోపు పాఠశాల, కళాశాల విద్యార్థులు, బడి బయట ఉన్న 11 నుంచి 18 వయసు లోపు వారిని గ్రూప్‌లుగా విభజించాలన్నారు. వారి సంరక్షణ, పోషణ అవసరాలు, కౌమార బాలికల సమస్యలు గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బాల్య వివాహాలు అరికట్టాలని, లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

పీఎం జన్మన్ పీవీటీజీ పథకం కింద జిల్లాకు 2,597 ఇళ్లు మంజూరవగా, మార్చి నెలాఖరుకు 184 గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట మండలాలపై దృష్టి సారించాలని సూచించారు.

గిరిజన సంక్షేమ శాఖలో కలకలం

- ఏటీడబ్ల్యూవోపై విచారణ
- టీడబ్ల్యూ డైరెక్టరేట్ ఆదేశాలతో కదిలిన అధికారులు

సీతంపేట రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సీతంపేట గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో ఏటీడబ్ల్యూవో మంగవేణిని అధికారులు విచారించడంతో కలకలం రేగింది. పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమెను బుధవారం డీడీ అన్నదొర, సూపరింటెండెంట్ దేశ్‌ల ఆధ్వర్యంలో విచారించారు. పలు ప్రశ్నించి వేసి సమాధానాలు రికార్డు చేశారు. లిఖిత పూర్వకంగా ఆమె ఏటీడబ్ల్యూవోకు సమాధానమిచ్చినట్లు తెలిసింది. కాగా ఆమెపై డీ-జేఏసీ(దళిత సంఘాల సంయుక్త మండలి) పేరుతో గత ఏడాది అక్టోబరు నెలలో కలెక్టర్, రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు వెళ్లాయి. వాటిపై విచారణ చేపట్టాలని కలెక్టరేట్ నుంచి ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోకు ఆదేశాలు వచ్చాయి. రాష్ట్ర గిరిజనసంక్షేమ శాఖ డైరెక్టరేట్ నుంచి కూడా ఉత్త ర్వులు అందాయి. దీంతో ఎట్టకేలకు అధికారులు సదరు అధికారిణిని విచారించారు.

ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు

- ఏటీడబ్ల్యూవో మంగవేణిపై వచ్చిన ఫిర్యాదులోని అంశాలు ఈ విధంగా ఉన్నాయి. సీతంపేట ఐటీడీఏలో పరిధిలో గిరిజనసంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్, పోస్టుమెట్రిక్ వసతిగృహాల్లో పనిచేస్తున్న డిప్యూటీ వార్డెన్, హెచ్‌డబ్ల్యూవోలను బ్లాక్‌మెయిల్ చేసి వేధింపులకు గుర్తిచేస్తున్నారు.
- డిప్యూటీ వార్డెన్ల మనోభావాలను దెబ్బతీసే విధంగా చులకనగా, కించపరిచేలా మాట్లాడుతున్నారు. 18 హాస్టల్స్‌లో చదువుతున్న ఒక్కో గిరిజన విద్యార్థి నుంచి రూ.30 చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేసి తీసుకుంటున్నారు. ఒకవేళ ఇవ్వకపోతే సంబంధిత వార్డెన్‌కు మెమోలు, సస్పెండ్ చేయిస్తానని బెదిరిస్తున్నారు. డైట్ బిల్లుల పేమెంట్‌లు అవ్వకముందే స్టూడెంట్‌కి రూ.30 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇలా ఇవ్వని వారిని మార్చి కొత్తవారిని నియమిస్తున్నారు.
- డైట్ బిల్లులు స్యూటీకి వెళ్లిన వార్డెన్లను అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారు. హాస్టల్స్‌కు సంబంధించిన డైట్‌బిల్స్ ట్రెజరీలో అప్రూవ్ చేయించడం కోసం ఒక శాతం ఇవ్వాలని వార్డెన్ల వద్ద నుంచి కలెక్షన్‌లు చేస్తున్నారు. దసరా, సంక్రాంతి, వేసవి సెలవుల్లో పాఠశాల క్లోజింగ్, పునఃప్రారంభం రోజున పాఠశాలలను విజిట్ చేసి విద్యార్థుల హాజరు తక్కువగా ఉంటే డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. డిప్యూటీ డైరెక్టర్ల పేరు చెప్పి బెదిరించి వార్డెన్‌ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

లిఖిత పూర్వకంగా రాసిచ్చా..

ఈ విషయంపై ఏటీడబ్ల్యూవో మంగవేణిని వివరణ కోరగా ..' నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించలేదు. డీడీ ఎదుట విచారణకు హాజరయ్యా. నేను చెప్పదలచుకున్నది లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చా.' అని ఆమె తెలిపారు.

ఉత్తర్వుల మేరకు..

'టీబ్ల్యూ డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏటీడబ్ల్యూవో మంగవేణిని విచారించాం. ఆమెపై ఫిర్యాదు చేసిన ఫిర్యాదు దారుడిని కూడా విచారిస్తాం.' అని డీడీ అన్నదొర తెలిపారు.



సీతంపేట ఐటీడీఏలోని డీడీ కార్యాలయం

ఒక చోట పరికరాల కొరత.. ఇంకోచోట పరికరాలు ఉన్నా... సదుపాయాల్లేక వినియోగానికి దూరం. మౌలిక సౌకర్యాలూ అంతంతమాత్రమే. అవసరానికి సరిపడే గదులు లేక పరికరాలను మూలన పడేస్తున్నారు. ఆక్సిజన్ ప్లాంట్లు ఉన్నా.. ఉపయోగ పడడం లేదు. ఇదీ జిల్లాలోని వివిధ ఆస్పత్రుల పరిస్థితి. ఈ ఆస్పత్రుల పరిస్థితులను 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా.. అనేక సమస్యలు బయట పడ్డాయి. పరికరాలు లేకపోవడంతో ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబులను ఆశ్రయించాల్సి వస్తోంది.

పరికరాలు ఉన్నా.. పని చేయట్లే!



భోగాపురం సీహెచ్‌సీలో మూలకు చేరిన స్కానింగ్ పరికరం

● సౌకర్యాల్లేక మూలకు చేరిన వైనం ● కొన్నిచోట్ల మరమ్మతులు కరువు ● అత్యవసర సేవలకు అంతరాయం ● తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు


వరండాలోనే చికిత్స పొందుతున్న రోగులు

మూలకు చేరిన పరికరాలు..

నెల్లిమర్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలోని సామాజిక ఆసుపత్రిలో ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి. కానీ అవసరమైనన్ని భవనాలు లేవు. దీనికి గతంలోనే విలువైన ఎక్స్‌రే యంత్రం, వెంటిలేటర్లు, ఆక్సిజన్ ప్లాంట్ మంజూరయ్యాయి. స్థలం సరిపోక ఆపరేషన్ థియేటర్‌కు సమీపంలోనే వెంటిలేటర్లు, ఎక్స్‌రే మిషన్, ఆక్సిజన్ ప్లాంటును పక్కన పెట్టేసి ఉంచారు. దీనిపై ప్రధాన వైద్యాధికారి డాక్టర్ వినోద్ లాల్వాణి మాట్లాడుతూ ఆక్సిజన్ ప్లాంటు ఏర్పాటు చేయలేకపోవడంతో వెంటిలేటర్ వినియోగంలో లేదన్నారు. అందువల్ల అత్యవసర రోగులను విజయనగరం సర్వజన ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారని ఆయన తెలిపారు.

వినియోగానికి దూరం..



మూతపడిన ఐసీయూ

పాలకొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పాలకొండలోని ఏరియా ఆసుపత్రిలో రోగులకు అవసరమైన యంత్ర పరికరాలు, మౌలిక వసతులు అందుబాటులో ఉన్నా వాటి వినియోగం అంతంత మాత్రమే. అల్ట్రా స్కానింగ్ పరికరాలు ఉన్నా రేడియాలజిస్ట్ పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో సరిగా సేవలు అందడం లేదు. వారంలో రెండు రోజులు మాత్రమే సీతంపేట ఏరియా ఆసుపత్రి నుంచి రేడియాలజిస్ట్ వస్తున్నారు. దీంతో మిగిలిన ఐదు రోజులు రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఐసీయూ విభాగం ఉన్నప్పటికీ రోగులకు అవసరమైన ఆక్సిజన్ పూర్తి స్థాయిలో అందించే అవకాశం ఉండడం లేదు. ఈ యూనిట్ పూర్తిగా వినియోగంలోకి తీసుకురాలేని పరిస్థితి ఉంది.

మూలన పడేశారు..

గుమ్మలక్ష్మీపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భద్రగిరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో విలువైన పరికరాలు, మంచాలు మూలన పడి ఉన్నాయి. వీటిని ఉపయోగంలోకి తీసుకొద్దామంటే సరిపడా వసతులు ఆసుపత్రిలో లేవు. ఈ విషయమై ఆసుపత్రి వైద్యులకు వివరణ కోరగా వసతులు లేనందను ఈ పరికరాలను ఓ చోట ఉంచామన్నారు. నూతన భవన నిర్మాణం పూర్తయితే పరికరాలన్నిటినీ ఉపయోగంలోకి తీసుకొస్తామన్నారు.

పేరుకే ఐసీయూ..



ఆస్పత్రిలోని ఐసీయూ విభాగం

పార్వతీపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర ఆసుపత్రిలో తెలుగుదేశం ప్రభుత్వ కాలంలో రూ.25 లక్షలతో ఐసీయూ ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రత్యేక వైద్యులను, సిబ్బందిని ఏర్పాటు చేసుకొనే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో ఇది పూర్తి స్థాయిలో ఉపయోగ పడడం లేదు. అవసరమైన సిబ్బందిని నియమిస్తే... ఇక్కడ ఐసీయూ సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది.

స్టోర్ రూమ్‌కే పరిమితం..


వరండాలో ఉన్న బెడ్లు

కురుపాం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి రోగులకు అవసరమైన వైద్య పరికరాలు వచ్చినప్పటికీ గదులు లేకపోవడంతో స్టోర్ రూముకు పరిమితం చేశారు. ఆసుపత్రిలో పేషెంట్లు ఉండటానికి ఒకే వార్డు ఉంటంతో ఇంకా బెడ్లు వేయడానికి స్థలం లేక వరండాలో సేవలు అందిస్తున్నారు. మిగిలిన బెడ్లు ఆసుపత్రి బైట వరండాలో ఉంచారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణిని వివరణ కోరగా... పూర్తి స్థాయిలో రూములు లేకపోవడంతో అన్ని పరికరాలు వినియోగించలేకపోతున్నామని తెలిపారు.

పని చేయని స్కానింగ్ యంత్రం..

చీపురుపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి వంద పడకల ఆసుపత్రిలో ప్రస్తుతం 45 పడకలే అందుబాటులో ఉన్నాయి. గైనకాలజీ విభాగంలో గత ఆరు నెలలుగా స్కానింగ్ యంత్రం పని చేయక పోవడంతో, గర్భిణులు ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. దీనిపై సూపరెంటెండెంట్ డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ స్కానింగ్ యంత్రం పని చేయని విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని తెలిపారు.

ఆరుబయటే యంత్రాలు..


ఆరుబయట పడి ఉన్న విలువైన పరికరాలు

రాజాం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజాం సామాజిక ఆస్పత్రిలో మొబైల్ ఎక్స్‌రే మిషన్‌తో పాటు ఇతర పరికరాలు, యంత్రాలు ప్రాంగణంలోనే నిరుపయోగంగా పడి ఉన్నాయి. వీటి విలువ రూ.లక్షల్లో ఉంటుంది. కనీసం ప్యాకింగ్ కూడా తెరవలేదు. దుమ్ము, ధూళితో పాటు నిరుపయోగంగా అక్కడ పడి ఉన్న తీరు దయనీయం. వసతులు లేనందునే ఈ పరిస్థితి తలెత్తింది. ఒక వైపు భవన నిర్మాణ పనులు, మరోవైపు పడి ఉన్న పరికరాలతో రోగులు, వైద్యులు, సిబ్బంది అసౌకర్యానికి గురవుతున్నారు.

ఫిజియోథెరపిస్టు లేక...


బొబ్బిలిలో నిరుపయోగంగా ఉన్న ఎక్స్‌రే పరికరాలు

బొబ్బిలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో వసతులు సరిపడకపోవడంతో వరండాల్లో పడకలు వేయాల్సి వస్తోంది. ఫిజియోథెరపిస్టు లేకపోవడంతో అందుకు సంబంధించిన పరికరాలు వృథాగా ఉంటున్నాయి. ఎక్స్‌రే ప్లాంటు నిర్వహణకూ సరైన వసతి లేదు.

స్కానింగ్ పరికరాలు నిరుపయోగం

భోగాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భోగాపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్కానింగ్ పరికరాలు సరిగా పని చేయడం లేదు. ఇది కొంతకాలంగా మరమ్మతులకు గురైంది. దీంతో గర్భిణులకు సేవలు అందించడం, వారికి వైద్య పరీక్షలు చేయడం కష్టంగా ఉంటోంది. దీంతో గర్భిణులు ప్రైవేటు ల్యాబులలో స్కానింగ్ చేసుకోవలసి వస్తోంది. దీనిపై సీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్‌ను వివరణ కోరగా సుమారు ఆరు నెలలుగా స్కానర్ పని చేయడం లేదని తెలిపారు. మరమ్మతులు చేయించి... వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు.

టెక్నీషియన్లు లేక...


మూలకు చేరిన అల్ట్రా సౌండ్ స్కాన్ పరికరం

రామభద్రపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ప్రతి నెలా పరీక్షలు నిర్వహించేందుకు అల్ట్రా సౌండ్ స్కాన్ పరికరాన్ని మంజూరు చేశారు. సంబంధిత టెక్నీషియన్లు లేకపోవడంతో ఇది మూలకు చేరుకుంది. భవనాల సమస్య కూడా ఆసుపత్రిని వేధిస్తోంది. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స పరికరాలూ నిరుపయోగంగా ఉన్నాయి.

ఆరుబయటే తరగతులు

● డిగ్రీ కళాశాల విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
● వేధిస్తున్న వసతి సమస్య
● మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే జయకృష్ణ
● స్థానికుల్లో చిగురిస్తున్న ఆశలు


ఆరుబయట చదువుతున్న విద్యార్థులు

వీరఘట్టం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. సొంత భవనాలు లేకపోవడంతో నేటికీ జూనియర్ కళాశాల ప్రాంగణంలోనే తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. వసతి సమస్య కారణంగా వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరుబయటే విద్యనభ్యసించలేకపోతున్నారు. వాస్తవంగా ఇంటర్ విద్యార్థులకు రెండుపూటలా తరగతులు నిర్వహించాలని ఇటీవల ఉన్నతాధికారులు ఆదేశించడంతో డిగ్రీ విద్యార్థులకు కష్టాలు మొదలయ్యాయి. డిగ్రీ కళాశాలకు గతంలో యు.వెంకమ్మపేట సమీపంలో ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించారు. 2015లో నాబార్డు నుంచి 5.25 కోట్లు మంజూరయ్యాయి. భవన నిర్మాణాలు చేపట్టకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. దీంతో డిగ్రీ విద్యార్థులకు జూనియర్ కళాశాల ప్రాంగణంలోని ఆరు బయట తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. ఈ సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఇటీవల విశాఖలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ఈ ప్రాంతవాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

కూటమి చొరవతో కళాశాల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరైతే విద్యార్థుల కష్టాలు తీరనున్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

జూనియర్ కళాశాలలో రెండు పూటలా తరగతులు నిర్వహించడంతో డిగ్రీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నిధులు మంజూరైతే ఇబ్బందులు తొలగుతాయి.

-సుధాకర్‌రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

నిధుల మంజూరుకు ప్రయత్నిస్తాం..

డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణానికి కృషి చేస్తున్నాం. ఈ విషయాన్ని విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకొని వెళ్లాం. నిధులు మంజూరయ్యేలా ప్రయత్నిస్తున్నాం.

-నిమ్మక జయకృష్ణ, ఎమ్మెల్యే, పాలకొండ



డిగ్రీ కళాశాలకు కేటాయించిన స్థలం

ఘనంగా పెదపోలమాంబ అంపకోత్సవం

మక్కువ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదేవత, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన శంబర పోలమాంబ అమ్మవారి మేనత్త పెదపోలమాంబ అంపకోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. బంగారు రంగుపూతతో అలంకరించిన ఘటాలతో మంగళవారం రాత్రంతా గ్రామంలో తిరువీధి నిర్వహించారు. బుధవారం ఉదయం యాత్రా స్థలానికి అమ్మవారి ఘటాలు చేరుకున్నాయి. అక్కడ ఘటాలకు ఉయ్యాల-కంబాల నిర్వహించారు. అనంతరం భక్తుల కోలాటాలు, మంగళ వాయిద్యాలు, బాజా భజం త్రీల మధ్య పెదపోలమాంబ అమ్మవారి ఘటాలను తీసుకెళ్లి పోలమాంబ వద్ద ఉంచారు. బుధవారం చిన్న పోలమాంబ అమ్మవారిని గ్రామంలోకి తీసుకొని వచ్చేందుకు చాటింపు వేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తీల్ల పోలినాయుడు, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, ట్రస్టు బోర్డు ఛైర్మన్ పూడి దాలినాయుడు, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న దృశ్యం

మోదీకి బ్రహ్మరథం


రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం


విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం

భారీగా తరలివచ్చిన జనం

» రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
» పూలవర్షం కురిపించిన అభిమానులు
» కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనం పైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.


వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్


బహిరంగ సభకు హాజరైన అశేష జనం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శృంగవరపుకోట జనవరి 8 (ఆంధ్రజ్యోతి): శృంగవరపు కోట పట్టణ పరిధిలోని పలు ప్రాంతాలకు గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రుద్ర రవికుమార్ తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు లైన్ మరమ్మతుల దృష్ట్యా సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. పందిరప్పన్న కూడలి, రైల్వే స్టేషన్ రోడ్డు, దేవి బొమ్మ కూడలి, మండల కార్యాలయాలు, పుణ్యగిరి, బర్మాకాలనీ, వైఎస్ఆర్ లే-అవుట్, శ్రీనివాసకాలనీ, ఆఫీషియల్ కాలనీ, టీచర్స్ కాలనీ, చైతన్య కాలనీ, వివేకానంద కళాశాల, పుణ్యగిరి కళాశాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

పని కల్పించాలని ఆందోళన

కొత్తవలస, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు కల్పించాలని కొత్తవలస పంచాయతీ 202 కాలనీకి చెందిన కూలీలు బుధవారం ఆందోళనకు దిగారు. కాలనీలో వారు మాట్లాడుతూ ఉపాధి పనులు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. గతంలో తమకు మంజూరైన జాబ్‌కార్డులను కూడా రద్దు చేశారని, ఇప్పుడు జాబ్ కార్డులు ఉండాలంటున్నారని ఆవేదన చెందారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయింపు

శృంగవరపుకోట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పంచాయతీ శివారు పుణ్యగిరి ఒకటో వార్డు పరిధిలోని గిరిజన శ్మశానవాటికకు స్థలాన్ని రెవెన్యూ అధికారులు కేటాయించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గిరిజనులు చేసిన పోరాటం ఫలితంగానే స్థలం కేటాయింపు జరిగిందని పార్టీ నాయకుడు మద్దిల రమణ తెలిపారు.

హైబ్రీడ్ సాగును వినియోగించుకోండి

నెల్లిమర్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న హైబ్రీడ్ కూరగాయల సాగు పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి జమదగ్ని సూచించారు. మండలంలోని కొండవెలగాడలో బట్టు అప్పన్న సాగు చేస్తున్న టమాటా ట్రెల్లీ సాగును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైబ్రిడ్ కూరగాయల సాగు పథకానికి హెక్టారుకు రూ.20 వేలు రాయితీని అందిస్తున్నామన్నారు. రాయితీ వివరాల కోసం గ్రామ సచివాలయాల్లోని గ్రామ ఉద్యాన, వ్యవసాయ సహాయకులు, మండల ఉద్యాన అధికారిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఉద్యానశాఖాధికారి జ్యోత్స్నరాణి, రైతులు పాల్గొన్నారు.

వివేకానందను ఆదర్శంగా తీసుకోండి

శృంగవరపుకోట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని మోక్ష విద్య యోగా మందిర్ వ్యవస్థాపకుడు శీలా కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఎస్.కోట పట్టణంలో స్వామి వివేకానంద జీవిత సందేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ ఉప కార్యదర్శి డాక్టర్ ఆర్.కిశోర్‌తో కలిసి పలువురు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఆరోగ్యం, పోషకాహారంపై శిక్షణ

వేపాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వేపాడ మండలంలోని అన్ని గ్రామాల్లో శతశాతం ప్రకృతి వ్యవసాయం సాగు జరిగేలా కృషి చేయాలని ప్రకృతి వ్యవసాయ కేంద్రం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఆనందరావు అన్నారు మండలంలోని వీలుపర్తి శివారు చినదుంగాడ గ్రామంలో సబల, ఆర్‌వైఎస్ఎస్ సంస్థల సారథ్యంలో స్వయంశక్తి మహిళలకు ఆరోగ్యం, పోషకాహారం అంశాలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులను ప్రజలకు చేరువయ్యేలా చూడాలన్నారు. రీసోర్స్ పర్సన్ నభిష, మాస్టర్ ట్రైనర్ సరోజిని, క్లస్టర్ కో-ఆర్డినేటర్ వీరభద్రస్వామి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సరోజిని, ఎంటీఎం సన్యాసమ్మ, రాము, రామలక్ష్మి, మూర్తి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 309 దరఖాస్తులు

లక్కవరపుకోట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 309 దరఖాస్తులు వచ్చాయని అందులో 26 శాతం పరిష్కరించామని డిప్యూటీ తహసీల్దార్ టి.రమేష్ బుధవారం తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారన్నారు. 32 రెవెన్యూ గ్రామాల్లో నెల రోజుల పాటు నిర్వహించిన సదస్సులలో వివిధ రకాలకు చెందిన 309 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆర్‌వోఆర్ అడంగల్, పీపీబీకి సంబంధించి 287 దరఖాస్తులు, హౌస్ సైట్స్ కోసం రెండు, ఫ్రీహోల్డ్‌కు రెండు, 22ఎ-ఒకటి, ఎఫ్‌లైన్ 12, ఈనాం- ఒకటి, ఎఫ్ఎంసీ రెండు, ఈసీ-ఒకటి కావాలని దరఖాస్తులు వచ్చాయన్నారు.

తెలగ కుటుంబాలకు పరామర్శ

రాజాం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మరణించిన తెలగ సంక్షేమ సంఘం నాయకుల కుటుంబాలను ఉత్తరాంధ్ర నాయకులు బుధవారం పరామర్శించారు. మున్సిపాలిటీ పరిధిలోని కొండంపేట గ్రామానికి చెందిన గుడివాడ ఉత్తర్‌కుమార్, సలాది రాంబాబు. సంతవురిటి గ్రామానికి చెందిన పాలిశెట్టి సంతు కుటుంబాలను ఉత్తరాంధ్ర తెలగ సమన్వయ సంఘం సలహాదారులు పిల్లల రామకృష్ణ. అధ్యక్షుడు ఎజ్జల మురళీకృష్ణ. కార్యదర్శి ద్వారపు అజిత్‌కుమార్. సహాయ కార్యదర్శి నంది సూర్యప్రకాశ్ తదితరులు పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో పిల్లల శివ, వంకాయల సంజీవ్, దుప్పలపూడి శ్రీనివాసరావు, మానం గోవిందరావు, బి.ఉమామహేశ్వరరావు. వెంపల గోపాలరావు, రాజు, మురళీ, రవీంద్ర ఉన్నారు.

ప్రవాస భారతీయ దివస్‌కు రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా మంత్రి కొండపల్లి



విజయనగరం జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్న ప్రవాస భారతీయ దివస్ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖమంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరుకానున్నారు. కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఆహ్వానం మేరకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరు కావాల్సిందిగా శ్రీనివాస్‌కు సీఎం చంద్రబాబు సూచించారు. సమావేశంలో పాల్గొనే నిమిత్తం మంత్రి శ్రీనివాస్ బుధవారం రాత్రి విజయనగరం నుంచి బయలుదేరి భువనేశ్వర్‌కు వెళుతున్నారు. గురువారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించబోయే ప్రవాస భారతీయ దివస్ కార్యక్రమం రెండురోజుల పాటు జరుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలో నివసించే భారతీయ మూలాలున్న వారందరినీ ఏకం చేయడంతో పాటు ఆయా దేశాల్లో భారతీయ సంతతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించి తగిన పరిష్కారం కొనుగొనడం కోసం కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లోని ప్రవాస భారతీయ ప్రముఖులు పలువురు ఈ సమావేశాల్లో పాల్గొంటారు. ప్రవాస భారతీయ దివస్ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు.

మళ్లీ పాలకమండలి సమావేశం వాయిదా

- హాజరుకాని సభ్యుడి సంతకంపై అభ్యంతరం



నిబంధనలను వివరిస్తున్న ఈవోపీఆర్డీ

శృంగవరపుకోట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పంచాయతీ సాధారణ సమావేశం రెండోసారీ వాయిదా పడింది. బుధవారం ఉదయం 11 గంగలకు సర్పంచ్ గనివాడ సంతోషికుమారి అధ్యక్షతన పాలకమండలి సాధారణ సమావేశానికి ఏర్పాటు చేశారు. 5వ వార్డు సభ్యురాలు జి.నాగమణి, 11వ వార్డు సభ్యురాలు, 18వ వార్డు సభ్యుడు ఎ. సూరిబాబు హాజరయ్యారు. అప్పటికే రిజిస్టర్‌లో ఒకటో వార్డు సభ్యుడు సీదర్ బాద్‌షా పేరు నమోదై ఉంది. రిజిస్టర్‌లో 6 గురు సభ్యుల సంతకాలు ఉన్నప్పటికి సాధారణ సమావేశంలో మాత్రం ఐదుగురు సభ్యులు మాత్రమే ఉన్నారు. ఉదయం 12.30 గంటల వరకు సభ్యుల రాక కోసం అధికారులు వేచిచూశారు. సర్పంచ్‌తో కలిసి రిజిస్టర్‌లో 6గురు సభ్యుల సంతకాలు ఉండటంతో నిబంధనల ప్రకారం కోరం సరిపోతుందని అజెండాలో అంశాలపై చర్చ మొదలుపెట్టారు. స్థానికంగా ఉన్న లే-అవుట్‌లకు వీఎంఆర్‌డీఏ, పంచాయతీ వంటి అనుమతులు లేనందున ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయవద్దని సభ్యుడు చిప్పాడ శేషగిరిరావు సూచించారు. మిగిలిన వాటి ఆమోదానికి అంతా అంగీకరించారు. సాధారణ సమావేశం ముగిసిన తరువాత మూడో వార్డు సభ్యుడు కాపుగంటి శ్రీనివాసరావు నాలుగో వార్డు సభ్యురాలు పెదగాడి లక్ష్మి భర్త రాజుతో కలిసి సర్పంచ్ చాంబర్‌కు వచ్చారు. గతనెల డిసెంబర్ 28న 7గురు సభ్యులు హాజరైనప్పటికీ కోరం సరిపోలేదని సాధారణ సమావేశం వాయిదా వేశారని, ఇప్పుడు 6 గురు సభ్యులు హాజరుతో కోరం ఎలా సరిపోయిందని ప్రశ్నించారు. సాధారణ సమావేశంలో లేని సభ్యుడి సంతకం రిజిస్టర్‌లో ఎలా పెట్టించారని నిలదీశారు. ఇంతలో పంచాయితీ కార్యాలయానికి వచ్చిన ఉప సర్పంచ్ మోపాడ కుమార్ సర్పంచ్ చాంబర్‌కు వచ్చేందుకు నిరాకరించడంతో కార్యనిర్వాహక అధికారి కార్యాలయంలో కూర్చొబెట్టారు. 20 మంది సభ్యులకు 6గురు సభ్యుల హాజరును చూపించి కోరం సరిపోయిందని చెప్పడం, పంచాయతీలో లేని సభ్యుడి సంతకం రిజిస్టర్‌లో నమోదు చేయడాన్ని తప్పుపట్టారు. ఇదే విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావుతో ఫోన్‌లో మాట్లాడారు. దీంతో డీపీఓ మండల పంచాయితీ విస్తరణాధికారి ఐ.వి.లక్ష్మిను పంపించారు. నిబంధనల ప్రకారం 6గురు సభ్యులు సాధారణ సమావేశానికి హాజరైతే సర్పంచ్‌ను కలిపి 7గురు సభ్యులు అవుతున్నందున కోరం సరిపోతుందని వివరించారు. అయితే సమావేశం ప్రారంభం తరవాత సభ్యులు రిజిస్టర్‌లో సంతకం చేయడంతో పాటు సమావేశం ముగిసే వరకు ఉంటేనే కోరం సరిపోయినట్లు భావించాలన్నారు. సమావేశంలో లేని సభ్యుల సంతకం చెల్లదన్నారు. దీంతో 5గురు సభ్యులు హాజరైనట్లు పరగణిస్తున్నందున కోరం లేనట్లేనని తేల్చి చెప్పారు. ఈ సమావేశాని రద్దు చేసి మరోసారి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఈవో అనురాధకు సూచించారు. దీంతో ఈనెల 20న మరోసారి సాధారణ సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు సభ్యులందరికి సమాచారం పంపిస్తామని ఈవో తెలిపారు.

జాతీయస్థాయి ప్రదర్శనకు సైన్స్ ఫొటో

- పూణేలో ఈనెల 11, 12న ప్రదర్శన





ఎంపికైన సైన్స్ ఫొటో, ఉపాధ్యాయుడు వేణుగోపాల్

రాజాం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11, 12 తేదీలలో పూణేలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సైన్స్ ప్రదర్శనకు కంచరాం జడ్పీ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పందూరు వేణుగోపాల్ తీసిన సైన్స్ ఫోటో ఎంపికైంది. ఫౌండేషన్ ఫర్ అడ్వాన్సింగ్ సైన్స్ టెక్నాలజీ ఇండియా ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో సైన్స్ ఇన్ ఫోకస్ ఫొటో ప్రదర్శన పుణేలోని ఫెర్గ్యుసన్ కళశాలలో నిర్వహించనున్నారు. ఒకే ఫ్రేమ్ (ఫోటో)లో బహుళ కాంతి ధర్మాలు కనిపించడం ఫొటో ప్రత్యేకత అని వేణుగోపాల్ తెలిపారు. ఈ ఒక్క ఫొటోలోనే కాంతికి సంబంధించిన సమతల దర్పణంలో కాంతి క్రమ పరావర్తనం, కుంభాకార దర్పణం, పుటాకార దర్పణంలో కాంతి అక్రమ పరావర్తనం, కటకాలలో కాంతి వక్రీభవనం, కాంతి సంపూర్ణాంతర పరావర్తనం, కాంతి విక్షేపణం, కాంతి వివర్తనం వంటి పది ధర్మాలను చూపించడం జరిగిందని వివరించారు. జాతీయ స్థాయి ప్రదర్శనకు చిత్రం ఎంపిక కావడంపై పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎంవ వసంతకుమార్, ఉపాధ్యాయులు వేణుగోపాల్ ను అభినందించారు.

లోకేశ్‌ను కలిసిన నాగార్జున

చీపురుపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను బుధవారం సాయంత్రం విశాఖలో జిల్లా పార్టీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగార్జునని ఆలింగనం చేసుకుని లోకేశ్ కొద్దిసేపు మాట్లాడారు.



లోకేశ్‌తో మాట్లాడుతున్న నాగార్జున

తెలగ సంఘం నగర అధ్యక్షుడిగా గొల్లకోటి

విజయనగరం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలగ సంక్షేమ సంఘం విజయనగరం అధ్యక్షుడిగా గొల్లకోటి గురునాథ్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. టీడీపీలో క్రియాశీలకంగా ఉంటూనే మరోవైపు తెలగ సంక్షేమ సంఘ కార్యక్రమాలు, సామాజిక సేవాకార్యక్రమాల్లో పాల్గొనడంతో సంఘ సభ్యులు ఆయన్ని అధ్యక్ష పదవికి సభ్యులు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గొల్లకోటిని పలువురు అభినందించారు. సంఘ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

రాజాం అర్బన్ బీజేపీ అధ్యక్షుడిగా రంజిత్

రాజాం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాజాం అర్బన్ అ ధ్యక్షుడిగా జొన్నాడ రంజిత్ ఏకగ్రీవంగా బుధవారం ఎన్నికయ్యారు. నియో జక వర్గం పార్టీ ముఖ్యనాయకులు .కార్యకర్తలు. అభిమానులు కలిసి ఆయన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటగిరి నారాయణరావు.. రంజిత్‌కు నియామక పత్రం అందజేశారు. అనంతరం రంజిత్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడి సూచనలు మేరకు పార్టీని బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయుకులు వేమకోటి గిరిబాబు, గుడివాడ నాగరాజు, సామంతుల రమణనాయుడు, వావిలపల్లి ప్రసాద్, లింగం సారధి, పెద్దింటి శ్రీదేవి, యందవ కుమార్, ఎస్.విజయకుమార్, ఎస్.పోలినాయుడు, బి.రాజు, సీహెచ్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి హయాంలోనే జిల్లా అభివృద్ధి



మాట్లాడుతున్న విక్రమ్, భావన

విజయనగరం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కూటమి హయంలో జిల్లా అభివృద్ధి సాధ్యమని జనసేన నాయకులు అవనాపు విక్రమ్, భావన అన్నారు బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దూరదృష్టి కలిగిన నాయకులన్నారు. రాష్ట్ర అవసరాలు, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అడుగులు వేస్తున్నారన్నారు. ప్రధాని మోదీ విశాఖలో రూ. 2 లక్షల కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు చేయడం హర్షణీయమన్నారు. భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు పూర్తయితే, జిల్లా రూపురేఖలే మారుతాయన్నారు. విజయనగరంలోని ధర్మపురి ఐస్ ఫ్యాక్టరీ నుంచి 100 అడుగులు రోడ్డు వేసి, చింతవలస మీదుగా ఎయిర్‌పోర్టుకి కనక్ట్ చేస్తే ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు.జనసేన రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు పిఠాపురంలో నిర్వహించేందుకు పార్టీ నాయకత్వం నిర్ణయించిందని, ప్లీనరీ తరువాత పార్టీ సంస్థాగతంగా మరింత పటిష్ఠం కానుందని వారు వివరించారు.

'నేను- నాజీవితం' పుస్తకావిష్కరణ



పోతన్నను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ

విజయనగరం దాసన్నపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సేవాతత్పరుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగలి పోతన్న రచించిన నేను-నా జీవితం పుస్తకాన్ని ఎమ్మెల్సీ డాక్టరు పీవీ సూర్యనారా యణ రాజు బుధవారం అవిష్కరించారు. పెన్నదర్ల సంఘ కార్యాలయంలో రాష్ట్ర గాంధీ స్మారక నిధి సమన్వయకర్త పారినాయుడు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ సురేష్‌బాబు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, సాహితీవేత్త డాక్టర్ జక్కు రామకృష్ణ, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘు రాజు, రాజు, ఐవీపీ రాజు, ఎంవీఆర్ కృష్ణాజీ, అబ్దుల్ రవూఫ్ పాల్గొన్నారు.

కేసులు రాజీ చేయండి

విజయనగరం క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విజయనగరం, పార్వతీ పురం-మన్యం జిల్లాల్లో మార్చి 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను రాజీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణచక్రవర్తి సూచించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల న్యాయమూర్తులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎక్కువ కేసుల రాజీకి యత్నించాలన్నారు. కార్యక్రమంలో అదనపు న్యాయమూర్తులు ఎం.మీనాదేవి, అప్పలస్వామి, రాజేశ్‌కుమార్ పాల్గొన్నారు.

మూగ జీవాలకు అందని వైద్యం

భోగాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భోగాపురంలోని పశువుల ఆసుపత్రి నుంచి మూగ జీవాలకు సక్రమంగా వైద్య సేవలు అందడంలేదు. డాక్టర్లు అందుబాటులో లేకపోవడమే కారణం. రైతులు ఇబ్బంది పడుతున్నారు. స్థానిక పశువుల ఆసుపత్రికి బుధవారం కారిగొల్లపేటకి చెందిన దుక్క సన్యాసి సూడి ఆవును, అలబాని సన్యాసి మేకపిల్లలకు మందుకోసం ఆసుపత్రికి తీసుకువచ్చి పశు వైద్యుడి కోసం ఎదురుచూశారు. వైద్య సేవలు అందకపోవడంతో ఉసూరుమంటు రైతులు వెనుదిరిగారు. ఈ విషయమై పశు వైద్యాధికారి, ఏడీ మహాపాత్రోని వివరణ కోరగా.. తాను విశాఖ పట్నంలో శిక్షణలో ఉన్నానన్నారు. ఎల్ఎస్ఎ, ఓఎస్ ఇద్దరు విజయనగరం మందులు తేవడానికి వెళ్లారని బదులిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి

- మరో కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు



ఎన్.వి.రమణ (ఫైల్)

గంట్యాడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కొండతామరాపల్లి కూడలి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ దుర్మరణం చెందగా, మరో కానిస్టేబుల్ కు తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరంలో నివాసం ఉంటున్న హెడ్ కానిస్టేబుల్ ఎన్.వి.రమణ (50) అనంతగిరి పోలీసు స్టేషన్‌లో విధులు ముగించుకుని బుధవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నారు. కొండతామరాపల్లి కూడలి వద్దకు వచ్చేసరికి... విజయనగరం నుంచి అనంతగిరి పోలీసుస్టేషన్‌లో డ్యూటీకి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న గురునాథ్‌రెడ్డి.. హెచ్‌సీని ఢీ కొన్నారు. దాంతో రమణ అక్కడిక్కడే మృతి చెందారు. గురునాథ్‌రెడ్డి తీవ్రంగా గాయపడటంతో విజయనగరం ఆసుపత్రికి తరలించారు. ఏపీఎస్‌పీ డీఎస్పీ లక్ష్మీనారాయణ, విజయనగరం రూరల్ సీఐ లక్ష్మణరావు, గంట్యాడ ఎస్ఐ ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని వృద్ధుడు..

బాడంగి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): డొంకినవలస రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని రైలు ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. జీఆర్‌పీఎఫ్ హెచ్‌సీ డి.ఈశ్వర రావు కథనం మేరకు.. డొంకినవలస గ్రామానికి చెందిన బంకురు సూర్యనారాయణ (72) రైలుపట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. దీంతో భార్య అప్పలనర్సమ్మ సమాచారం అందజేశారు. సూర్యనారాయణకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా కుమారుడు ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. సూర్యనారాయణ మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేశారు.

1200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

మెంటాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మెంటాడ మండల సరిహద్దులోని అరకు ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో రొంపిల్లి, సెల్లిగుడ్డి, కోటపర్తివలస, చొట్టడివలస, రాబంద తదితర గ్రామాలలో బుధవారం అంతర జిల్లా ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. కోటపర్తివలస కొండ శిఖర ప్రాంతంలో సారా తయారీకి వినియోగించే సుమారు 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అధికారుల రాకను గమనించిన సారా తయారీదారులు పరారయ్యారు. దాడుల్లో గజపతినగరం సీఐ జె.జనార్దనరావు, ఎస్ఐ పి.నరేంద్రకుమార్, అరకు సీఐ ఎ.సంతోష్, ఎస్ఐ రమేష్, అరకు మొబైల్ సీఐ శ్రీధర్, విజయనగరం డీటీఎఫ్ ఎస్ఐ గంగాధర్ సిబ్బంది పాల్గొన్నారు.

రామలింగపురంలో 600 లీటర్లు..

కొత్తవలస, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామలింగపురం గ్రామ పరిసరాల్లో బుధవారం కొత్తవలసకు చెందిన ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించి 600 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేశారని ఎస్ఐ వి.ఎన్.రాజు తెలిపారు. బుధవారం తమ సిబ్బందితో కలిసి దాడులు చేపట్టామన్నారు. దాడిలో వీర్రాజు, బి.రాముడు, ప్రసాద్, బి.ఆదినారాయణ పాల్గొన్నారన్నారు.

సారా తయారీ కేంద్రంపై దాడి

విజయనగరం క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గుర్ల మండలం పకీరు కిత్తలి గ్రామ శివారులో సారా కేంద్రంపై దాడి చేసి 400 లీటర్ల బెల్లం ఊట, 20 లీటర్ల సారాని ధ్వంసం చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఇందిరాదేవి తెలిపారు. దాడిలో ఈసీలు నాయుడు, ధనలక్ష్మి, జనార్దన్ పాల్గొన్నారని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

విజయనగరం క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో రింగురోడ్డు నల్లచెరువు వద్ద కాటవీధికి చెందిన సోమేశ్వరావు వెళ్తుండగా విజయనగరం నుంచి నెల్లిమర్ల వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొంది. దాంతో సోమేశ్వరావుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని మెరుగైన చికిత్స కోసం విశాఖ తరలించినట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ ఎత్తివేత

కొత్తవలస, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినిలతో అసభ్యంగా ప్రవర్తించారనే ఆరోపణలతో సస్పెండ్ అయిన మండలంలోని వీరభద్రపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సన్యాసిరావుపై జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యాల నాయుడు సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. దీంతో సన్యాసిరావు బుధవారం విధుల్లో చేరారు. అక్కడ నుంచి డిప్యూటేషన్‌పై చీపురుపల్లి మండలం ముక్కాం గ్రామానికి ఆయన్ని బదిలీ చేశారు.

రూ.వెయ్యి కోసమే హత్య



నిందితుడితో సీఐ రామకృష్ణ

పూసపాటిరేగ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎరుకొండలో ఈనెల 5న రాత్రి సమయంలో గొర్లె పవన్‌కుమార్ హత్య కేసులో నిందితుడు బొంతు అప్పలనాయుడును బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గొర్లె పవన్‌కుమార్, బొంతు అప్పల నాయుడు పెయింటింగ్ పనులు కలిసి చేస్తుండేవారన్నారు. పనులు పూర్తయిన తర్వాత అప్పలనాయుడు డబ్బులు తీసుకుని పంచేవాడు. అయితే ఒక పనిలో రూ.వెయ్యి పవన్‌కుమార్‌కు ఇవ్వకపోవటంతో దానికోసం పదే పదే అతడు అడుగుతుండేవాడు. ఈ క్రమంలో కొప్పెర్ల వైన్‌షాపు వద్ద కూడా అప్పలనాయుడుతో వేరొకరు ఉండగా పవన్‌కుమార్ డబ్బులు అడిగాడు. అక్కడ అప్పలనాయుడు పలకకుండా వెళ్లిపోవటంతో వేరొక స్నేహితుడి నుంచి అతడికి పవన్ డబ్బుల కోసం గట్టిగా అడిగాడు. దాంతో మనస్తాపానికి గురైన అప్పలనాయుడు.. పవన్‌ను వేరొకచోటుకు తీసుకుని వెళ్లి చంపేయాలని నిర్ణ యించుకున్నాడు. పెయింటింగ్ పనికి ఉపయోగించే కత్తి లాంటి పరికరాన్ని జేబులో పెట్టుకుని పవన్‌కుమార్‌కు ఫోన్‌చేసి గ్రామంలో వైఎస్ఆర్ విగ్రహం దగ్గరకు రమ్మని పిలిచాడు. అక్కడ పవన్‌ను అప్పలనాయుడు తన బైక్‌పై ఎక్కించుకుని వెళ్లి తన ఇంటి దగ్గర దించేశాడు. తిరిగి పవన్ ఇంటి దగ్గరకు వెళ్లి ఘర్షణకు దిగాడు. ముందే తెచ్చుకున్న కత్తిలాంటి పరికరంతో ఛాతీపై, కడుపులో అప్పలనాయుడు పొడిచాడు. దాంతో పవన్‌కుమార్ అక్కడిక్కడే మృతి చెందాడని తెలిపారు. ఆ తర్వాత అప్పలనాయుడు అక్కడ నుంచి పరారై గ్రామానికి చేరువలోని తోటలో దాక్కొన్నాడు. అక్కడ నుంచి బైక్‌పై విశాఖకు పరావుతుండగా అరెస్టు చేశామని సీఐ తెలిపారు.

పోక్సో కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

విజయనగరం క్రైం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మహిళా పోలీసు స్టేషన్‌లో 2021 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నగరానికి చెందిన ఇద్దరికి పోక్సో ప్రత్యేక న్యాయాధికారి కె.నాగమణి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2,500 జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. నగరానికి చెందిన ఓ బాలిక తల్లిదండ్రులు నిత్యం గొడవ పడుతుండటంతో.. అమ్మమ్మ దగ్గరకు వెళ్లి, అక్కడే చదువుకొంటోంది. బాలిక తల్లి.. భర్తను వదిలేసి కోడూరు విజయ్‌కుమార్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. అయితే, బాలిక అమ్మఒడి డబ్బు విషయం అడిగేందుకు తల్లి వద్దకు వెళ్లింది. అదే సమయంలో కోడూరు విజయ్‌కుమార్ తనను లైంగికంగా వేధించాడని, అందుకు తన తల్లి ప్రోత్సహించిందని ఆ బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ పి.శ్యామలాదేవి పోక్సో కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు. న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ పూర్తయ్యే విధంగా మహిళా పీఎస్ సీఐ నర్సింహమూర్తి చర్యలు చేపట్టారు. కోడూరు విజయ్ కుమార్ బాలికపై లైంగిక దాడికి పాల్పడి వేధించాడని, అందుకు తల్లి సహకరించినట్టు నేరం రుజువు కావడంతో పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారి నాగమణి ఆ ఇద్దరు దోషులకు తీర్పు ఖరారు చేశారని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. పోక్సో కేసులో నిందితులకు త్వరితగతిన శిక్ష పడే విధంగా వ్యవహరించిన దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ అధికారులను ఎస్పీ అభినందించారు.

బాల్య వివాహాలను అరికట్టండి

గజపతినగరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహలు అరికట్టేం దుకు ప్రతీఒక్కరు చర్యలు చేపట్టాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి నాగమణి కోరారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో బుధవారం కిశోర వికాసం-2 కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు, అంగన్వాడీలు పాల్గొన్నారు.



ముక్కాం తీరంలో ముందుకొచ్చిన సముద్రం

ముందుకొచ్చిన సముద్రం

భోగాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలం ముక్కాం తీరంలో బుధవారం మధ్యాహ్నం సముద్రం ముందుకొచ్చింది. మత్స్యకారులను భయాందోళనలకు గురిచేసింది. సముద్రం గతం కన్నా సుమారు 50 అడుగుల మేర ముందుకు రావడంతో పాటు కెరటాలు బలంగా తీరాన్ని తాకాయి.

శ్రీరాములు నాయుడుకు నివాళి



నివాళులర్పిస్తున్న తూర్పుకాపు కార్పొరేషన్ నాయకులు

రాజాం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి గొర్లె శ్రీరాములునాయుడు వర్థంతిని బుధవారం రాజాం పట్టణంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తూర్పుకాపు కార్పొరేషన్ నాయకులు పాలవలస శ్రీనివాసరావు, ఆర్‌పీజే నాయుడు మాట్లాడుతూ తూర్పుకాపులను బీసీ-డిలో చేర్పించిన ఘనత ఆయనదేనన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు జడ్పీ చైర్మన్‌గా, సెంట్రల్ బ్యాంకు చైర్మన్‌గా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంత్రిగా జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, మడ్డువలస రిజర్వాయర్ నిర్మాణంలో చెరగని ముద్ర వేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో వైద్యులు కరణం హరిబాబు, పొట్నూరు సోమశేఖర్, మీసాల వెంకటేష్, రౌతు గణపతిరావునాయుడు. శాసపు వేణుగోపాలనాయుడు. ఈసర్ల మురళీకృష్ణ పాల్గొన్నారు.

- సంతకవిటి: మాజీ మంత్రి గొర్లె శ్రీరాములునాయుడు వర్థంతిని సంతకవిటిలో బుధవారం నిర్వహించారు. తూర్పుకాపు సంక్షేమ సంఘ ప్రతినిధులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తూర్పుకాపు సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఆబోతుల సత్యనారాయణ, దాసరి దుర్గాప్రసాద్, శ్రీనివాసరావు, బాలరాజు, కోటి, జయరాం, ప్రసాద్‌రావు, శంకరరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: ఐదుగురికి గాయాలు

భోగాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజాపులోవ సమీపంలో బుధవారం ఆటో బోల్తా పడిన ఘటనలో ఐదుగురు గాయాలపాలయ్యారు. విజయనగరం నుంచి విశాఖ వెళ్లే రహదారిలో ప్రమాదం జరిగింది. రోడ్డుపై నిలిచిన నీటిలో నుంచి ఆటోను నడపడంతో అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో ఆటోలో ఐదుగురు గాయపడ్డారు. ప్రమాద విషయాన్ని గమనించిన స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించారు.

చోరీ కేసులో వ్యక్తికి జైలు

డెంకాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రఘుమండ సమీపంలో జరిగిన రెండు బంగారు ఆభరణాల అపహరణ కేసులో విశాఖలోని సుభాష్‌నగర్‌కు చెందిన వి.కమల్‌నాథ్‌కు ఏడాది జైలు, రూ.వెయ్యి జరిమాన విధిస్తూ బుధవారం ప్రిన్స్‌పాల్ జూనియర్ సివిల్ జడ్జి పి.దేవిరత్నకుమారి తీర్పు వెలవరించారని బుధవారం డెంకాడ ఎస్ఐ సన్యాసి నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువకులు సరైన మార్గాన్ని ఎంచుకోవాలన్నారు. దురలవాట్లతో జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.

మత్స్యకార యువకుడి అదృశ్యం

భోగాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చినకొండ్రాజు పాలెంకు చెందిన మత్స్యకార యువకుడు గనగళ్ల దానయ్య అదృశ్యమైనట్టు తల్లి గనగళ్ల అంకమ్మ బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడు మంగళవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో భోజనం చేసి బయటకు వెళ్లాడని, మరుసటి రోజు ఉదమైనా ఇంటికి రాలేదని తెలిపింది. బంధువులు, స్నేహితులను విచారించినా ఫలితం లేకపోవడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. అంకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సీ శ్రీనివాసరావు తెలిపారు.

కందివలసలో ఏనుగుల బీభత్సం

కొమరాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో కందివలస సమీపంలో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. రైతు నాగిరెడ్డి సత్యానికి చెందిన వరి కుప్పలను చిందరవందర చేశాయి. తనకున్న కొద్ది పొలంలో కూరగాయల పంటను వేయగా మంగళవారం రాత్రి ధ్వంసం చేశాయని గౌరీశ్వరరావు వాపోయాడు. వేలాది రూపాయలను అప్పు తెచ్చి పంటలను పండిసున్నామని, ఏనుగులు వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించి రైతులను ఆదుకోవాలని కోరారు.

కిశోర్ వికాసంపై శిక్షణ

బాడంగి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో కిశోర్ వికాసంపై పంచాయతీకార్యదర్శులు, ఐసీడీఎస్‌సిబ్బంది, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు, సంక్షేమ కార్యదర్శులకు బుధవారంఎంపీడీవో ఎస్.రామకృష్ణ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బాలికలకు జరుగుతున్న అన్యాయాలు, పోక్సో చట్టం, సెల్ఫ్‌డిఫెన్స్, బాలల చట్టాలపై అవగాహన కల్పించారు.

● వీరఘట్టం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి):వీరఘట్టం జడ్పీ బాలికోన్నత పాఠశాలలో మన్యం జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ, మన్యం జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, లైంగికదాడులు నిర్మూలనపై విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమశాఖ పాలకొండ ప్రాజెక్టుసూపర్‌వైజర్లు రాజేశ్వరమ్మ, జానమ్మ, హెచ్‌ఎం వై.రమణమ్మ, శాంతికుమారి, కళ్యాణి, ఆర్.హరికృష్ణ పాల్గొన్నారు.

సైన్స్‌ఫెయిర్‌లో సత్తాచాటిన విద్యార్థులు

వీరఘట్టం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో సత్తాచాటారు. ఈమేరకు వారు ప్రదర్శించిన నాన్ మోటార్ వాటర్ పంపు ప్రాజెక్టు సాధరన్ ఇండియాకు ఎంపికైంది. విద్యుత్, పెట్రోల్, డీజిల్, గ్యాస్‌తో పాటు ఏ ఇతర శక్తి వనరులు లేకుండా నీటి గతిజ శక్తి, గ్రావిటీ ఆధారంగా పనిచేసే పంపింగ్‌మిషన్‌ను గైడ్ ఉపాధ్యాయులు గిరడ రామారావు ఆధ్వర్యంలో విద్యార్థులు నితిశ్‌కుమార్, పి.గోవింద్ రూపొందించారు. ఈ మేరకు వీరిని డీఈవో ఎస్.తిరుపతినాయుడు, పాలకొండ ఉపవిద్యాశాఖ అధికారి పి.కృష్ణమూర్తి, ఎంఈవోలు గౌరునాయుడు, ఆనందరావు, జిల్లా సైన్స్ అధికారి గిరడ లక్ష్మణరావు, హెచ్‌ఎం జగన్, ఉపాధ్యాయులు అభినందించారు.

తోటపల్లి ఆలయ హుండీల లెక్కింపు

గరుగుబిల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి, కోదండ రామస్వామి ఆలయాల్లో బుధవారం హుండీలను దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో ఈవో వీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో లెక్కించారు. వేంకటేశ్వరాలయానికి గత ఏడాది డిసెంబరు నుంచి ఈనెల ఎనిమిదో తేదీ వరకూ రూ. 3,51,594లు,కోదండరామాలయానికి 12,490లు భక్తుల నుంచి కానుకల రూపంలో వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయశాఖ ప్రతినిధి బి.అప్పలనాయుడు, గ్రామీణ వికాస్ బ్యాంకు సిబ్బంది బి.మాధవి, ప్రధాన అర్చకులు వీవీ అప్పలాచార్యులు, అభివృద్ధి కమిటీ సభ్యులు డి.ధనుంజయరావు, ఎం.పకీరునాయుడు, జి.శ్రీరామచంద్రమూర్తి, టి.పకీరునాయుడు, సిబ్బంది గంట శ్రీధర్‌నాయుడు, పి.పోలిరాజు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

పాలకొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కూరు ప్రాథమిక పాఠశాలలో బుధవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాలకొండ అగ్నిమాపక శాఖ అధికారి జామి సర్వేశ్వరరావు ప్రమాదాలు జరిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు మధుకుమార్, కృష్ణారావు, జయమ్మ, దుర్గ, అప్పలనాయుడు, గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

వినతులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

గరుగుబిల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాలవారీగా వచ్చిన వినతులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ పి.బాల, ఉప తహసీల్దార్ బి.సుందరరావు హెచ్చరించారుబుధవారం గరుగుబిల్లి, హిక్కింవలస గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గత ఏడాది డిసెంబరు ఆరో తేదీన ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు ముగిశాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు సమస్యలపై వినతులు అందించారు. సమావేశంలో వీఆర్వోలు బాలబాబు, రాఘవ, మండల సర్వేయర్ గాంధీతో పాటు సచివాలయ సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

● బొబ్బిలి రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బంకురువలస, భోజరాజపురంలో బొబ్బిలి తహసీల్దార్ ఎం.శ్రీను ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించా రు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు భాస్కరరావు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

గరుగుబిల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రహదారి మార్గాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు తెలిపారు. బుధవారం గొల్లవానివలస మలుపు తదితర ప్రధాన మార్గాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగారహదారి మలుపుల్లో ప్రమాదాల నివారణకు హెచ్చరికబోర్డులు ఏర్పాటుతోపాటు పిచ్చిమొక్కలను తొలగించారు. సంక్రాంతిని పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుంచి సొంత గ్రామాలకు వచ్చేవారు ప్రమాదాలబారిన పడకుండా ఉండేలా దృష్టి సారిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది అచ్యుతరావు, తదితరులు పాల్గొన్నారు.

●సీతానగరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై ఎస్‌ఐ ఎం.రాజేష్ అవగాహన కల్పించారు. బుధవారం జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

38 యూనిట్లు.. రూ.16,579 బిల్లు

●ఆందోళన చెందుతున్న వినియోగదారుడు



బిల్లు చూపిస్తున్న సురేష్

గరుగుబిల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లిలోని ఓ విద్యుత్ వినియోగదారుడు డిసెంబరులో 38 యూనిట్లు వినియోగించగా, రూ.16,579 బిల్లు రావడంతో ఆందోళన చెందుతున్నాడు. బాధితుడి కథనం మేరకు.. బి.సురేష్‌కు చెందిన సర్వీస్ నెంబరు 122215సి351000063కు సంబంధించి డిసెంబరులో 38 యూనిట్లు వినియోగించినట్లు ఈపీడీసీఎల్ అధికారులు అందజేసిన బిల్లులో వివరాలు నమోదయ్యాయి. చిన్నపాటి దుకాణం నిర్వహిస్తున్న తనకు అధిక మొత్తంలో బిల్లు రావడంతో లబోదిబోమంటున్నాడు. కాగా రీడింగ్ తప్పిదం జరిగి ఉంటుందని గరుగుబిల్లి ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పర్యవేక్షణ లేక.. నిర్వహణకు నోచుకోక

● చీకటిపడితే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా ● ఇదీ పార్వతీపురం జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో పరిస్థితి



అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన పార్వతీపురం జూనియర్ కళాశాల క్రీడా మైదానం ఇదే

పార్వతీపురంటౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంపై అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో నిర్వహణకు నోచుకోవడం లేదు. దీంతో చీకటిపడిన తర్వాత అసాంఘిక కార్యకలాకాలకు అడ్డాగా మారుతోంది.

కళాశాల క్రీడా మైదానం జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ఎందరో క్రీడాకారులకు ఓనమాలు నేర్పింది. పిల్లలు, వృద్ధులకు మానసికోల్లాసాన్ని అందించ డంతోపాటు బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలికవ్యాధిగ్రస్థులకు ఉదయం, సాయంత్రం నడవడానికి ఎంతగానో ఉపయోగపడుతోంది.ఇంతటి ప్రాధాన్యతగల క్రీడామైదానంపై విద్యాశాఖాధికారులు పర్యవేక్షణ కొరవడింది.దీంతో చీకటిపడితే అసాంఘిక పనులకు ఆవాసంగా మారుతోంది.కొందరు మద్యం తాగడంతోపాటు ఇతర కార్యకలాపాలు చేస్తుండడంతో ఉదయం నడవడానికి వచ్చే వారంతా అవస్థలకు గురవుతున్నారు. క్రీడా మైదానానికి కూతవేటు దూరంలో రూరల్ పోలీసుస్టేషన్, కలెక్టరేట్ ఉన్నా అసాంఘిక కార్యకలాపాలు జరగడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. క్రీడా మైదానానికి రెండువైపులా గేట్లు ఉన్నా తాళాలు వేయడంలేదని పలువురు చెబుతున్నారు. ఘనచరిత్రగల మైదాన నిర్వహణపై దృష్టిసారించి అసాంఘిక కార్యకలాపాలకు చెక్‌చెప్పడానికి విద్యాశాఖాధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. కాగాక్రీడామైదాన నిర్వహణపై త్వరలోనే ప్రణాళికలు సిద్ధంచేస్తున్నామని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామారావు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీసులకు ఫిర్యాదుచేస్తామని చెప్పారు.

భక్తి శ్రద్ధలతో పొన్నాకుల హారతి

ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాల్లో ధనుర్మాసోత్సవాలు పురస్కరించుకుని బుధవారం పొన్నాకుల హారతి కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.



బొబ్బిలి: వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



సాలూరు రూరల్: కల్యాణ వేంకటేశ్వరస్వామికి..

బొబ్బిలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో వేదపండితులు, ఆలయ అర్చకులు పొన్నాకుల హారతికార్యక్రమాన్ని బుధవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేకువజామున వందలాది మంది భక్తులు పొన్నాకులు పట్టుకొని అందులో హారతి వెలిగించి స్వామివారికి నివేదించారు. వేదమంత్రోచ్ఛారణల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనడానికి వందలాది మంది భక్తులు తరలివచ్చారు.అలాగే కంచర, సింగారపువీధుల్లోగల కల్యాణ వేంకటేశ్వరాలయాల్లో కూడా పొన్నాకుల హారతి కార్యక్రమం నిర్వహించారు.

●సాలూరు రూరల్,జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సాలూరులోని కల్యాణ వేంకటేశ్వరాలయంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి, పెదకోమటిపేట రామాలయంలో పద్మనాభస్వామి, గోదాదేవికి పొన్నాకుల హారతి నిర్వహించారు.రుత్వికులు నారాయణాచార్యులు, ఉదయభాస్కరాచార్యులు,శ్యామాచార్యులు శాస్త్రోక్తంగా పూజలుచేశారు.

ప్రధాని పర్యటనతో ఉత్తరాంధ్ర అభివృద్ధి: మంత్రి



విశాఖ వెళ్లే బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న సంధ్యారాణి

సాలూరు,జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పధానమంత్రి పర్యటనతో విశాఖతోపాటు ఉత్తరాంధ్ర మరింతగా అభివృద్ధి చెందుతుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. బుధవారం విశాఖలో జరిగిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభకు సాలూరు నియోజకవర్గం నుంచి వెళ్లే బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. ఆమెతో పాటు పట్టణ టీడీపీ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, బృందావనం అశోక్‌తో పాటు పలువురు టీడీపీ,జనసేన,బీజేపీ నాయకులు ఉన్నారు.

రాజన్నదొరపై విచారణ జరిపించాలి

●టీడీపీ రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షుడు ధారూనాయక్

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లు వైసీపీ పాలనలో మాజీ మంత్రి రాజన్నదొర గిరిజనులను అడ్డంగా దోచుకుని, అన్ని వ్యవస్థలనూ నిర్వీర్యం చేశారని, ఆయన చేసిన అక్రమాలపై విచారణ జరిపించాలని టీడీపీ రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షుడు ధారూనాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఐదేళ్లు దోపిడీ పాలన సాగిందని, నేల, నీరు, ఖనిజం.. ఒకటేంటి కన్ను పడిందల్లా కాజేశారని ఆరోపించారు. జగన్ పాలనలో గిరిజన యువత నిర్వీర్యమైపోయిందని పేర్కొన్నారు. గత వైసీపీ పాలనలో గిరిజన విశ్వ విద్యాలయాన్ని నిర్వీర్యం చేసిన రాజన్నదొర రూ.కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. గత వైసీపీ పాలనలో ఏజెన్సీ గిరిజన పంచాయతీల నిధులను దొర స్వాహా చేశారని తెలిపారు. పెసా చట్టాన్ని ఉల్లంఘించి హైడ్రో పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్రాజెక్టుల పేరుతో లక్షలాది గిరిజనుల అటవీ భూములను అదానీ, అరబిందో లాంటి బడా కంపెనీలకు ధారాదత్తం చేశారని ఆరోపించారు. గిరిజనుల భూములను అన్యాయంగా ఖాళీ చేయించి రాజన్నదొర లేటరైట్ అక్రమంగా తవ్వి రూ.కోట్లలో అవినీతికి పాల్పడ్డారని పేర్కొన్నారు. రాజన్నదొర వ్యక్తిగత ప్రయోజనాల కోసం గిరిజనులకు ద్రోహం చేశారని, ఆయన అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బుధవారం ఒక ప్రకటనలో సీఎం చంద్రబాబును కోరారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలి

గరుగుబిల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి):ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనేజర్ పి.షణ్ముఖరాజు కోరారు. బుధవారం తోటపల్లిలోని జట్టు కార్యాలయ ప్రాంగణంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన నేటి నేస్తం సభ్యులకు రెండు రోజులపాటు శిక్షణలో భాగం గా ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జట్టు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్, కోడైరెక్టర్ ఎం.నూకంనాయుడు, రిసోర్స్‌పర్సన్ ఎ.మహేష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీడీగా కృష్ణవేణి

పార్వతీపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ గిరిజన విద్యాశాఖ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్‌గా కృష్ణవేణి నియమితులయ్యారు. సాలూరు ఇన్‌చార్జి ఏటీడబ్ల్యూగా పనిచేస్తున్న ఆమెకు ఇన్‌చార్జి డీడీగా నియమిస్తూ గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ సదా భార్గవి ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి డీడీగా ఎం.గయాజుద్దీన్ విధులు నిర్వహించిన విషయం విదితమే.

అవినీతిపై విచారణ జరపాలి

బొబ్బిలి/బొబిలి రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో అవినీతిపై సమగ్రంగా విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కన్వీనర్ పి.శంకరరావు డిమాండ్ చేశారు. బుధవారం బొబ్బిలిలో విలేకరులతో మాట్లాడుతూ మునిసిపాలిటీలోని రోడ్లపై ఏర్పడిన గోతులను పూడ్చేందుకు రూ.50 లక్షలు కేటాయించి క్రషర్ బుగ్గి వేసి అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గోడ పెయింటింగ్స్‌కు రూ.18 లక్షలు, రోడ్డుపై ఉన్న డివైడర్‌పై రంగులు వేసేందుకు రూ. 10 లక్షలు కేటాయించి నాసిరకం పనులు చేసి అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. సొంత వాహనాలకు డీజిల్ కొట్టించి నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు కలెక్టర్, ఆర్డీ స్పందించి సమగ్రంగా విచారణ చేసి చర్యలు తీసుకోకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎస్.గోపా లం, సురేష్, పరశురాం పాల్గొన్నారు.

అపరాల రైతులు జాగ్రత్తలు పాటించాలి

సీతానగరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అపరాల రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏవో ఎస్.అవినాష్ తెలిపారు. బుధవారం మండలంలోని వెన్నెల పుచ్చంపేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో జగదీష్, రైతులు పాల్గొన్నారు.

తెలుగుభాష ఔన్నత్యం కోసం పాటుపడాలి

బొబ్బిలి జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలుగుభాష ఔన్నత్యం కోసం పాటుపడాలని రోటరీ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ జేసీ రాజు పిలుపునిచ్చారు. రాజమండ్రిలో తెలుగు మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం బొబ్బిలి శ్రీ కళాభారతి ఆడిటోరియం ప్రాంగణంలో గల తెలుగుతల్లి విగ్రహానికి ప్రత్యేక వందనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాకారులు, సాహితీ సంస్థల ప్రతినిధులు ప్రవీణ్‌కుమార్, కరుణకుమార్, రామకృష్ణ, అప్పలనాయుడు, శ్రీనివాస్, రంపా రాజమోహన్, డాక్టర్ బొంతు శ్రీరాములు పాల్గొన్నారు.

సాలూరులో సమస్యలు పరిష్కరించాలి

సాలూరు రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సాలూరు మునిసిపాలిటీ అభివృద్ధిని పాలకవర్గం పట్టించుకోవడం లేదనిపట్టణ పౌర సంక్షేమ సంఘం నేత ఎన్‌వై నాయుడు ఆక్షేపించారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని కోరారు. బుధవారం సాలూరులో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ లైబ్రరీ, ప్రభుత్వ ఐటీఐలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని తెలిపారు. రైతు బజారు నిరుపయోగంగా ఉందన్నారు. సమావేశంలో పట్టణ పౌరసంక్షేమ సంఘ నేతలు ఈశ్వరరావు, ప్రసాద్, రవి, కల్యాణ్ పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం సంతకు సంక్రాంతి శోభ



క్రయవిక్రయదారులతో కిటకిటలాడుతున్న సంత

గుమ్మలక్ష్మీపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురంలో బుధవారం జరిగిన సంతలో సంక్రాంతి శోభ సంతరించుకుంది. ఏటా సంక్రాంతి ముందు జరిగే సంత కిటకిటలాడుతుంది. పండుగకు అవసరమైన సరుకులు కొనుగోలుకు గుమ్మలక్ష్మీపురంతోపాటు చుట్టుపక్కల మండలాల నుంచి తరలివస్తారు. బుధవారం ఇక్కడకు దుస్తులు, నిత్యావసర సరుకులు, బెల్లం, నూనె, వంట పాత్రలు తదితర పండగ సామగ్రి కొనుగోలుకు పెద్దసంఖ్యలో గిరిజనులు రావడంతో కిక్కిరిసి పోయింది. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వ్యాపార లావాదేవీలు సాగాయి. మన్యంలో ఉష్ణోగతలు తగ్గిపోవడంతో చలి తీవ్రత పెరిగినా కొందరు వ్యాపారులు తెల్లవారుజామునే సంతకు చేరుకున్నారు.

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యేలు



విశాఖపట్నంలో బుధవారం పలు శంకుస్థాపనలు చేయడానికి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్న కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను బొబ్బిలి, కురుపాం ఎమ్మెల్యేలు బేబినాయన, తోయక జగదీశ్వరి కలుసుకున్నారు. (కురుపాం-ఆంధ్రజ్యోతి)

నేడు చేతివృత్తుల శిక్షణకు నమోదు చేసుకోవాలి

పాలకొండ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీ పరిధిలో ఉన్న వివిధ రంగాల్లో పనిచేస్తున్న చేతి వృత్తుల వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేయనున్నట్టు కమిషనర్ సర్వేశ్వరరావు పేర్కొన్నారు.బుధవారం పాలకొండలో విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ, గ్రీజర్, టీవీ మెకానిక్స్, బ్యూటీషియన్లతో పాటుగా వివిధ రకాల సేవలందించే వారికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో హోం ట్రయాంగిల్ ప్లాట్‌ఫారం ద్వారా నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి జీవనోపాధి కల్పిస్తామని చెప్పారు. ఈ మేరకు బుధవారం నగరపంచాయతీ మెప్మా విభాగంలో మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు సమర్పించి నమోదు చేసుకోవాలని కోరారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నగర పంచాయతీ కార్యాలయంలోని గురు వారం ఉదయం సాధారణ కౌన్సిల్ సమావేశం జరుగుతుందని కమిషనర్ సర్వేశ్వరరావు పేర్కొన్నారు

రేపు విద్యుత్‌చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

పాలకొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పాలకొండలో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ చార్జీలపై హైబ్రీడ్ విధానంలో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ టీజీకేమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా డిస్కమ్‌ల టారీఫ్ అంశంపై అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

రేపు జాబ్ మేళా

బొబ్బిలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐలో ఉత్తీర్ణులైన 18 నుంచి 35 సంవత్సరాల్లోపు వయస్సు కలిగిన వారుఉదయం తొమ్మిది గంటలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలరి పేర్కొన్నారు. పటేలు రైలు, స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ లిమిటెడ్, స్విగ్గీ వేర్‌హౌస్ తదితర బహుళ జాతి కంపెనీలు జాబ్‌మేళాను నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఆసక్తి గల యువత వెబ్‌సైట్‌లో తమ వివరాలు, పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8790118349 లేదా టోల్ ఫ్రీ నెంబరు 9988853335 నెంబరుకు సంప్రదించాలని కోరారు.

ఉత్తరాంధ్ర స్థాయి పద్యరచన పోటీలకు ఆహ్వానం

బొబ్బిలి,జనవరి 8(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయుల జయంతిని పురస్కరించుకొని వచ్చే నెల 14న తెలుగుభాష ఔన్నత్యాన్ని తెలుగుజాతికి చాటిచెప్పేందుకు ఉత్తరాంధ్ర స్థాయిలో పద్యరచన పోటీలను నిర్వహించనున్నట్లు శ్రీసాహితీ సేవా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి సంగంనాయుడు, డాక్టర్ బొంతు శ్రీరాములు ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. శ్రీకృష్ణ దేవరాయలు-తెలుగు భాష- సంస్కృతీ వైభవం అన్న అంశంపై చేతిరాతతో రచనలు చేసి తమకు పంపాలని కోరారు. ఆసక్తి గల వారు పద్యరచనలను రెడ్డి సంగంనాయుడు, ఆర్ఎస్ఆర్‌కే రంగారావు కళాశాల, బొబ్బిలి, విజయనగరం అన్న చిరునామాకు వచ్చే నెల ఆరో తేదీలోగా పంపించుకోవాలని పేర్కొన్నారు.

ఆధునిక యంత్రాలతో రైతులకు మేలు

రాయగడ, జనవరి 8(ఆం ధ్రజ్యోతి): అధునిక యంత్రా లు ఉపయోగించి సాగుచేయ డంవల్ల రైతులకు మేలు జరుగుతుందని జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి తెలిపారు. బుధవారం రాయ గడ ఐఏసీఆర్ కళాశాల ఎదుట గల మైదానంలో జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆధునిక యంత్రాల మేళానిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నిరంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని తెలిపారు. వ్యవసాయ రంగంలో యంత్రాల వినియోగం వల్ల సమయం, ఖర్చులు కలిసి వస్తాయన్నారు. ఈ మేళా ఈనెల 11 వరకు జరుగుతుందని వ్యవసాయాధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్యవ్యవసాయాధికారి బిష్ణు ప్రసాద్ దాస్, ఐటీడీఏ ప్రాజెక్ట్ మేనేజర్ చంద్రకాంత్ మఝి పాలొన్నారు.



కౌలు రైతులకు రుణాలు: ఏవో

రామభద్రపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఏడాది రబీ సీజన్‌లో కౌలురైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని ఏవో వి.వెంకటయ్య తెలిపారు. బుధవారం రామభద్ర పురం వ్యవసాయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 542 మంది కౌలు రైతులకు ఈఏడాది రుణాలివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఇప్పటికే అర్హత ఉన్నవారి పేర్లను బ్యాంకర్లకు అందించామని తెలిపారు.